సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం, 5, ఫిబ్రవరి, 2024



సోమశిలలో 24.611 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 24.611 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం నుంచి వ్యవసాయానికి 4,800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.64,800
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,819
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,994
సవర (8 గ్రాములు)	రూ.47,952

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.0 /23.9

ఆదివారం గాలిలో తేమ 67 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. సోమవారం ఎలాంటి మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

10 లోపు ఇంటర్ తత్కాల్ ఫీజు చెల్లింపులు

నెల్లూరు రూరల్ : మార్చి నెలలో జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు, ఒకేషనల్ విద్యార్థులు ఈ నెల 10వ తేదీ లోపు 'తత్కాల్' ద్వారా ఆయా కళాశాలల్లో రూ.3 వేల అపరాధ రుసుంతో ఫీజు చెల్లించే అవకాశం ఇంటర్ బోర్డు కల్పించిందని ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎ.శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

టీడీపీ నేతల నీటి రాజకీయం



కండలేరు ఎడమగట్టు కాలువకు విడుదల చేసిన సాగునీరు

పొదలకూరు : రైతుల అవసరాల మేరకు కండలేరు ఎడమగట్టు కాలువకు నీటిని విడుదల చేయిస్తామని అధికారులు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రకటించినా టీడీపీ నాయకులు పొదలకూరు మండలంలో నీళ్ల రాజకీయం చేస్తున్నారు. పైర్లు ఎండుపోతున్నాయని వెంటనే కాలువకు నీటిని విడుదల చేయాలంటూ శనివారం పొదలకూరు ఇరిగేషన్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. వాస్తవానికి వారం క్రితమే మంత్రి మండలంలోని ఆర్‌వైపాళెం సచివాలయ భవన ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా రైతులకు అవసరమైతే కాలువకు ఎత్తిపోతల ద్వారా నీటిని విడుదల చేయిస్తామని తెలిపారు. అయితే టీడీపీ నాయకులు సోమిరెడ్డి ఆధ్వర్యంలో ప్రతిదీ రాజకీయం చేస్తూ లబ్ధిపొందాలనే ప్రయత్నంలో కాలువకు నీటిని విడుదల చేయకుంటే నిరాహారదీక్ష చేస్తామని పేర్కొన్నారు. ఎటూ సాగునీటిని విడుదల చేస్తారనే సమాచారం తెలుసుకుని తమ వల్లనే కాలువకు నీటిని విడుదల చేశారని ప్రచారం చేసుకునేందుకు టీడీపీ వారు ధర్నాకు దిగినట్టుగా రైతులే వెల్లడిస్తున్నారు. మంత్రి చెప్పినట్టుగానే సాగునీటిని విడుదల చేయించడంపై రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

ఎత్తిపోతల ద్వారా 180 క్యూసెక్కులు

కండలేరు ఎడమగట్టు కాలువకు ఎత్తిపోతల (లిఫ్ట్ ఇరిగేషన్) ద్వారా 180 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ అనిల్ కుమార్‌రెడ్డి తెలిపారు. చెరువుల కింద వరి సాగు చేస్తున్న రైతుల అవసరాలను బట్టి ఎన్ని రోజులు నీటిని విడుదల చేయాలనేది నిర్ణయిస్తామన్నారు. వారం రోజుల క్రితమే కాలువకు నీటిని విడుదల చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

- ఐఎఫ్ఎస్ అధికారి శ్రీనివాసులురెడ్డి



పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూరు: సంక్షేమ వసతి గృహాల్లో పదో తరగతి విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టం గుర్తెరిగి ఇష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ డిప్యూటీ కార్యదర్శి బుడిగి శ్రీనివాసులు రెడ్డి సూచించారు. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని బీసీ సంక్షేమ వసతి గృహాల్లో పదో తరగతి చదివే విద్యార్థులకు ఆదివారం పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి వై.వెంకటయ్య, ఆత్మకూరు ఏఎస్‌డబ్ల్యూఓ ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఐఎఫ్ఎస్ శ్రీనివాసులురెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తాను పుట్టింది వైఎస్సార్ జిల్లాలోనైనా చదువు నెల్లూరు జిల్లాలోనే సాగిందన్నారు. ఆత్మకూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాసినట్లు తెలిపారు. తనకు కంటి చూపు పూర్తి స్థాయిలో లేని కారణంగా పాఠశాలకు, పరీక్షలు రాసేందుకు ఇద్దరి సహాయకులతో వెళ్లాల్సి వచ్చేదని తెలిపారు. ఇష్టపడి పట్టుదలతో ఐఏఎస్‌కు శిక్షణ పొంది ఐఎఫ్ఎస్ సాధించానని చెప్పారు. ప్రస్తుతం విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ డిప్యూటీ కార్యదర్శిగా పనిచేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు గతం గురించి ఆలోచన వదిలేయాలని, ఉజ్వల భవిష్యత్ కోసం లక్ష్యం ఏర్పరుచుకుని నిరంతర కృషి, పట్టుదలతో చదివి దాన్ని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటరమణారెడ్డి, బీఎస్సార్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులునాయుడు, ఉపాధ్యాయులు ఉస్మాన్‌ఘని, చక్రపాణి, వెంకటేశ్వర్లు, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



బ్యాటింగ్ చేస్తున్న ఎస్పీ తిరుమలేశ్వర్‌రెడ్డి



హోరాహోరీగా తలపడుతున్న పోలీస్ టైగర్స్, రెవెన్యూ రాయల్స్ జట్లు



మ్యాచ్ ఆడుతున్న మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్

నిరంతరం విధి నిర్వహణలో బిజీగా ఉండే అధికారులంతా ఒక్కచోట చేరి క్రికెట్ ఆడుతూ సందడి చేశారు. పనిఒత్తిడి నుంచి బయట పడేందుకు ఉత్సాహంగా ఆటలో నిమగ్నమయ్యారు. ఆదివారం నెల్లూరు నగరంలోని పోలీసు కవాతు మైదానం వేదికగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ లీగ్ పోటీల్లో కలెక్టర్ కెప్టెన్‌గా రెవెన్యూ రాయల్స్, ఎస్పీ కెప్టెన్‌గా పోలీస్ టైగర్స్, నగరపాలక సంస్థ కమిషనర్ కెప్టెన్‌గా మున్సిపల్ కార్పొరేషన్ ఫైటర్స్, డీఆర్‌డీఏ పీడీ కెప్టెన్‌గా డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ చాలెంజర్స్ జట్లు క్రికెట్ ఆడి ఉల్లాసంగా గడిపాయి. - ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్

టికెట్ కోసం కుమ్ములాటలు

కందుకూరు టీడీపీలో టికెట్ నాదంటే నాదే అంటున్న ఆశావహులు

కందుకూరు నియోజకవర్గ టీడీపీలో టికెట్ కోసం సిగపట్లు పడుతున్నారు. ఆశావహులు ఎవరికి వారు టికెట్ తమదేనంటూ తెగ హడావుడి చేస్తున్నారు. కానీ టీడీపీ అధినేత చంద్రబాబు చూపు ఎవరి వైపు ఉంటుందోనని కేడర్ ఎదురుచూస్తోంది. అయితే అభ్యర్థుల విషయంలో నాన్చుడు ధోరణి అవలంభిస్తుండడంతో అంతర్గత కుమ్ములాటల వరకు వెళ్లింది.

- టికెట్ తమకే ఖరారైందని ప్రచారం చేసుకుంటున్న ప్రస్తుత ఇన్‌చార్జి నాగేశ్వరరావు వర్గం
- ఆయనకు టికెట్ రాకుండా అడ్డుకునే ప్రయత్నంలో మరో వర్గం
- అభిప్రాయ సేకరణకు దూతలను పంపిన అధినాయకత్వం
- దూతల వద్ద తన బలం చూపేందుకు శిబిరం పెట్టిన రాజేష్ వర్గం
- ఎన్నికలకు ముందే అంతర్గత పోరు



టీడీపీ అధిష్టానం పంపిన దూతలను సన్మానిస్తున్న ఇంటూరి నాగేశ్వరరావు, దివి శివరాం (ఫైల్)



ప్రత్యేకంగా బలప్రదర్శనకు దిగిన ఇంటూరి రాజేష్ వర్గం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, నెల్లూరు : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ కందుకూరు నియోజకవర్గ నాయకుల మధ్య అంతర్గత కుమ్ములాటలు తారస్థాయికి చేరాయి. నిన్నటి వరకు ఆధిపత్యం కోసం పోటీపడిన నేతలు.. ప్రస్తుతం పార్టీ టికెట్ కోసం వర్గాలుగా విడిపోయి ఎత్తుకుపై ఎత్తులు వేస్తున్నారు. వీరిలో ప్రధానంగా టీడీపీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు, ఆయనకు ప్రత్యర్థిగా ఉన్న ఇంటూరి రాజేష్‌ల మధ్య పోరు బహిరంగంగానే సాగుతోంది. అయితే ఇటీవల పార్టీలో చేరిన మహిళా నాయకురాలు ఉన్నం నళినీదేవి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కోటపాటి జనార్దన్‌రావులు అంతర్గత పోరుకు తెరలేపారు. ఇక పోతుల రామారావు, దివి శివరాం వర్గాలు తామేమీ తక్కువ కాదంటూ తమ రాజకీయ అనుభవానికి పదును పెట్టి తలపడుతున్నారు.

ఎవరికి వారు ప్రచారాలు

పార్టీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు వర్గం టికెట్ తమకే ఖరారైందని, పార్టీ అధిష్టానం కూడా తమకు హామీ ఇచ్చిందని ఇటీవల ప్రకటించుకుని ప్రచారం చేసుకుంటోంది. అయితే నాగేశ్వరరావును మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న రాజేష్ వర్గం నేతలు మాత్రం అతనికి టికెట్ ఎలా వస్తుందో చూస్తామంటూ బహిరంగంగానే సవాల్ చేస్తున్నారు. టికెట్ విషయంలో పార్టీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, తమకే టికెట్ వస్తుందంటూ రాజేష్ వర్గం ఢంకా భజాయించి చెప్పుకుంటోంది. దీంతో ఈ రెండు వర్గాల మధ్య సోషల్ మీడియా వేదికగా పోరు ఉధృతంగా సాగుతోంది. ఒకవేళ టికెట్ తనకు ఇవ్వని పక్షంలో మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావుకు ఇవ్వాలని రాజేష్ వర్గం వాదన వినిపిస్తోంది. నాగేశ్వరరావుతో కలిసి పనిచేయాలని రాజేష్‌కు పలుమార్లు అధిష్టానం చెప్పినా, యర్రగొండపాళెం నియోజకవర్గ పార్టీ వ్యవహారాలు చూసుకోవాలని సూచించినా రాజేష్ మాత్రం ఇక్కడే తేల్చుకుంటానంటూ భీష్మించుకుని కూర్చుకున్నారు. టికెట్ తనకు దక్కకపోయినా పరవాలేదు.. నాగేశ్వరరావుకు మాత్రం దక్కనీయనని రాజేష్ చెబుతుండడం గమనార్హం.

నన్ను పరిగణనలోకి తీసుకోండి

పార్టీలో సీనియర్, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం కూడా చివరి అవకాశంగా టికెట్ కోసం మరో ప్రయత్నం మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. మొదట్లో ఇంటూరి రాజేష్‌ను, తరువాత ఇంటూరి నాగేశ్వరరావును తెరపైకి తెచ్చిన, రాజకీయంగా ప్రోత్సహించిన శివరాం.. రాజేష్‌తో వచ్చిన గొడవతో ఆయనకి పార్టీలో ప్రాధాన్యం లేకుండా చేశారు. ప్రస్తుతం నాగేశ్వరరావుతో సఖ్యతగా ఉంటూనే తెర వెనుక తన ప్రయత్నాలు తాను చేస్తున్నట్లు తెలిసింది. చివరి అవకాశంగా ఈ సారి టికెట్ తనకు ఇవ్వాలని అధిష్టానం వద్దకు రాయబారాలు నడుపుతున్నారని భోగట్టా. ఇక మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు కూడా తన ప్రయత్నాలు తీవ్రంగానే చేసుకుంటున్నారని సమాచారం.

అధిష్టానం నుంచి వచ్చిన దూతలు

ఈ పరిస్థితుల్లో అసలు నియోజకవర్గంలో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు టీడీపీ అధిష్టానం శనివారం ఇద్దరు దూతలను కందుకూరుకు పంపింది. వీరిలో ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఉన్నారు. వీరు పార్టీ కార్యాలయంలో శనివారం కార్యకర్తల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టారు. అదే సమయంలో మిగిలిన నాయకులను కూడా రావాలని వర్తమానం పంపారు. అయితే నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉన్న పార్టీ కార్యాలయానికి వచ్చే ప్రసక్తే లేదని రాజేష్ దూతలకు చెప్పినట్లు సమాచారం. పైగా పోటీగా తన కార్యాలయంలో తన వర్గం నాయకులు, కార్యకర్తలతో రాజేష్ సమావేశం నిర్వహించి బల ప్రదర్శనకు దిగారు. మిగిలిన నాయకులు దూతల సమావేశానికి డుమ్మా కొట్టారు.

అయోమయంలో కేడర్

ప్రస్తుతం కందుకూరు నియోజకవర్గంలో జరుగుతున్న ఈ గందరగోళంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర అయోమయంలో ఉన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో టీడీపీ గెలిచి రెండు దశాబ్దాలైంది. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మరోసారి ఓటమి తప్పదని పార్టీ క్యాడర్ భావిస్తోంది.

అధినేత వద్ద చక్రం తిప్పుతా.. టికెట్ ఇప్పిస్తా



టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలో ప్రస్తుతం పార్టీ బాధ్యతలు చూస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మరో నాయకుడికి టికెట్ ఇప్పిస్తానంటూ హామీ ఇచ్చినట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. కోటపాటి జనార్దన్‌రావు అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి కందుకూరు టికెట్ రేసులో తాను న్నానంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఈయనకు ప్రధానంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మద్దతు ఉన్నట్లు ఆ పార్టీ ద్వితీయశ్రేణి నాయకులే చెబుతున్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఆర్థికంగా శ్రీకాంత్‌కు సహాయ సహకారాలు అందించిన జనార్దన్‌రావు రుణం తీర్చుకునే ప్రయత్నంలో ఎమ్మెల్సీ ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో జనార్దన్‌రావు కూడా ఇటీవల నియోజవకర్గంలోని ప్రతి గ్రామంలో తన ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుని ప్రచారంలో దూసుకుపోతున్నారు. స్థానికేతరుడైన జనార్దన్‌రావుకు పార్టీ టికెట్ ఇప్పించడం ద్వారా భవిష్యత్‌లో నియోజకవర్గంలో తనకు రాజకీయంగా కలిసి వస్తుందనే ఆలోచనలో శ్రీకాంత్ ఉన్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉంటే ఇటీవల బీజేపీ నుంచి టీడీపీలో చేరిన ఉన్నం నళినీదేవి కూడా కొందరు బీజేపీ పెద్దలు, ఓ మీడియా అధినేత సహకారంతో టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం



కనుపూరులో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కనుపూరులో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.17.20 లక్షలతో నిర్మించిన శ్మశాన వాటిక ప్రహరీని మంత్రి కాకాణి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు హడావుడిగా శంకుస్థాపన శిలాఫలకాలు వేసిందని, తమ ప్రభుత్వం ప్రజలు కోరుకున్న పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవ శిలాఫలకాలను ఆవిష్కరిస్తోందని తెలిపారు. 2014 ఎన్నికలకు ముందు రైతులకు, మహిళలకు రుణమాఫీ చేస్తామని నమ్మించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇచ్చిన హామీని విస్మరించారని తెలిపారు. చంద్రబాబు మోసాలతో ఆగ్రహించిన ప్రజలు 2019 ఎన్నికల్లో తమ ఓటుతో చంద్రబాబుకు బుద్ధి చెప్పి ఇంటికి పంపారని మంత్రి గుర్తుచేశారు. మోసాలు చేయడంలో చంద్రబాబును మించిన ఘనుడు లేరన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ప్రతి హామీని అమలు చేసి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని తెలిపారు. నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం పరితపిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించేందుకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కుట్రలు చేస్తున్నారని, అయితే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ప్రజలకు మేలు జరిగిందని నమ్మితేనే తనకు ఓటు వేయాలని ధైర్యంగా చెప్పడం గొప్ప విషయమని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మందా కవిత, వైస్ ఎంపీపీలు కనుపూరు కోదండరామిరెడ్డి, పచ్చబట్ల మస్తానయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, సర్పంచ్ నాటకం శ్రీనివాసులు, నాయకులు కొణిదెన విజయభాస్కర్‌నాయుడు, చీకుర్తి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

కావేరి సీడ్స్‌పై కేసు నమోదు

నెల్లూరు(సెంట్రల్): మనుబోలు మండలం చెర్లోపల్లిలోని పలువురు రైతులను, విడవలూరు మండలంలోని అలగానిపాడు రైతులను సీడ్స్ విక్రయాల్లో మోసం చేసినందుకు కావేరి సీడ్స్, అలాగే ఉత్పత్తిదారులుగా ఉన్న నంద్యాల శివనంది ట్రేడర్స్‌పై మనుబోలు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి సత్యవాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే కావేరి సీడ్స్ లైసెన్సు రద్దు చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులకు తెలియజేశామని తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



నెల్లూరు(వీఆర్‌సీసెంటర్): నగరంలోని చిల్డ్రన్స్ పార్కులో కర్రసాము పోటీలను ఆదివారం నిర్వహించారు. సౌతిండియా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను రాయల్ లియో క్లబ్ ఫౌండేషన్ అధ్యక్షురాలు వర్షిత, డీసీసీబీ జిల్లా చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు అందజేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే సురక్షిత ప్రయాణం



ర్యాలీగా వెళుతున్న ఎస్పీ, డీటీసీ, విద్యార్థులు

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రతి ఒక్కరూ సురక్షితంగా ప్రయాణించి గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎస్పీ కె.తిరుమలేశ్వరరెడ్డి సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేలా ఆదివారం జిల్లా రవాణా శాఖ, కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఏసీ సుబ్బారెడ్డి క్రీడామైదానం వరకు విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన ఎస్పీ మాట్లాడుతూ ప్రయాణ సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కుటుంబాలను రోడ్డున పడేస్తుందన్నారు. ప్రధానంగా మితిమీరిన వేగం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం మత్తులో వాహనాలు నడపడం, సిగ్నల్స్ క్రాస్ చేయడం, హెల్మెట్ ధరించకపోవడం, సీటుబెల్టు పెట్టుకోకుండా వాహనాలు నడపడం లాంటి అజాగ్రత్తలు, నిర్లక్ష్యం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. గతేడాది జిల్లాలో 498 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారన్నారు. ప్రయాణ సమయంలో ప్రతి ఒక్కరూ తప్పనసరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ సురక్షితంగా ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. డీటీసీ చందర్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవడంతోపాటు నిబంధనలు విధిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ ప్రతినిధి బొల్లినేని గిరినాయుడు, జిల్లా ప్రజా రవాణాధికారి శేషయ్య, ఆర్టీఓలు సిరిచందన, సుధాకర్‌రెడ్డి, ఎంవీఐలు బాలమురళీకృష్ణ, మురళీమోహన్, బాబు, పూర్ణచంద్రరావు, పవన్‌కార్తీక్, అసిస్టెంట్ ఎంవీఐలు రఘువర్ధన్‌రెడ్డి, స్వప్నిల్‌రెడ్డి, రఫీ, రాము, ఏఓలు కిశోర్, రామ్మోహన్, పోలీసు, రవాణా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదల గూడుకు ఎసరు

గృహ నిర్మాణ శాఖలో భారీ అవినీతి

- రూ.1.20 కోట్లు స్వాహా చేసినట్లు తేల్చిన నిఘా విభాగం
- జిల్లాస్థాయి అధికారి నుంచి ఏఈ వరకు బాధ్యులే
- చర్యలకు ఆదేశించినా పట్టించుకోని ఆ శాఖ ఉన్నతాధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): పేదల ఇళ్ల నిర్మాణంలో అధికారులు అక్రమాలకు పాల్పడినట్లు తేలింది. టిడ్కో గృహాలకు వాడాల్సిన సిమెంట్, స్టీల్, సామగ్రిని పక్కదారి పట్టించి సొమ్ము చేసుకున్నారు. వేలాది బస్తాల సిమెంటు గోదాముల నుంచి ప్రైవేట్ కాంట్రాక్టర్లకు విక్రయించుకున్నారు. గుట్టుచప్పుడు కాకుండా సాగిన ఈ అక్రమాల తంతును ఆ శాఖ అంతర్గత నిఘా విభాగం వెలికితీసింది. కోట్లాది రూపాయల విలువైన సామగ్రి గోదాముల్లో కన్పించలేదని తేల్చింది. ఈ కుంభకోణంలో ప్రధాన పాత్ర పోషించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని నివేదిక ఇచ్చి ఏడాదైనా ఆ శాఖ ఉన్నతాధికారులు మాత్రం చర్యలకు ఉపక్రమించలేదు. ఈ అవినీతి బాగోతంలో జిల్లా స్థాయి అధికారి పాత్ర కూడా ఉండడంతో చర్యలకు వెనుకాడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమాలు ఇలా..

నెల్లూరు రూరల్ ప్రాంతంలో కొండ్లపూడి వద్ద గల టిడ్కో భవనాల నిర్మాణం కోసం ఉన్న గృహనిర్మాణశాఖ గోడౌన్‌ను నిఘా, నాణ్యతా విభాగం రాష్ట్ర 3వ జోన్ గృహనిర్మాణశాఖ అధికారులు 2022 అక్టోబర్ 27వ తేదీన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గృహ లబ్ధిదారులకు మెటీరియల్ పంపిణీ చేయడానికి సంబంధించి గృహ నిర్మాణ శాఖ ఏఈ మధుసూదన్‌రావు స్టాక్‌లో తేడా ఉండడంతో అక్రమాలకు పాల్పడినట్లు తేలింది. వాస్తవానికి తనిఖీ సమయానికి 30,028 సిమెంటు బస్తాలు గోడౌన్‌లో నిల్వ ఉండాలి. అయితే కేవలం 233 సిమెంట్ బస్తాలు మాత్రమే నిల్వ ఉండగా, 29,795 బస్తాలు ఏమయ్యాయో తెలియని పరిస్థితి. గోడౌన్‌లకు సరఫరా అయిన సిమెంటు బస్తాలు కూడా రికార్డుల్లో నమోదు కాలేదు. నిఘా విభాగం తనిఖీల్లో స్టాక్ రిజిస్టర్ ప్రకారం 15.913 మెట్రిక్ టన్నుల స్టీల్ ఉంది. ఆన్‌లైన్ రిపోర్టులో మాత్రం 173.91 మెట్రిక్ టన్నులు ఉండాల్సి ఉంది. కాగా గోడౌన్‌కు దిగుమతి చేసిన స్టీల్‌ను కూడా రికార్డుల్లో నమోదు చేయలేదని తెలుస్తోంది. అంతేకాకుండా నెల్లూరు అర్బన్ గృహ నిర్మాణశాఖ డీఈ, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారులు తరచూ ఆకస్మిక తనిఖీలు చేయలేదని తేటతెల్లమైంది. ఈ అవకతవకలపై డివిజనల్ ఇంజినీర్ (ప్రస్తుతం ఇన్‌చార్జి పీడీ) ఎ.నాగరాజు, అర్బన్ డీఈ దయాకర్, ఏఈ మధుసూదన్‌రావులను వివరణ ఇవ్వాలని ఆ శాఖ కోరింది.

అవినీతి రూ.5.42 లక్షలేనా?

రూ.1.25 కోట్ల అవినీతి జరిగినట్లు తెలుస్తుంటే ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ ఆ శాఖ వెంటవెంటనే రికార్డుల్లో లబ్ధిదారులకు సిమెంటు, స్టీలు ఇచ్చినట్లు నమోదు చేసి కేవలం రూ.5,42,881 మాత్రమే దుర్వినియోగం జరిగినట్లు ఆ శాఖ ఉన్నతాధికారులు తెలియజేయడం అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది. లబ్ధిదారులకు సిమెంట్, స్టీల్ సరఫరా చేసే సమయంలో మధుసూదన్‌రావు, దయాకర్, నాగరాజులు నిబంధనలను అతిక్రమించి దుర్వినియోగానికి పాల్పడినట్లు నిర్ధారణ అయింది. దీనికి సంబంధించి చర్యలకు ఉపక్రమిస్తూ గృహ నిర్మాణశాఖ సంయుక్త మేనేజింగ్ డైరెక్టర్ 2023 మార్చి నెలలో వారికి మెమోలు జారీ చేశారు.

మెమోలతో సరిపెట్టారు

గృహ లబ్ధిదారులకు అందాల్సిన సిమెంట్, స్టీల్ దుర్వినియోగం చేసినట్లు సాక్షాత్తు నిఘా విభాగం తనిఖీల్లో తేటతెల్లమైనా గృహనిర్మాణశాఖ ఉన్నతాధికారులు కేవలం మెమోలకే పరిమితం చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. అప్పట్లో ఈఈ నాగరాజును వారం రోజుల్లోపు వివరణ ఇవ్వాలని ఆదేశించినా రెండు నెలలు గడిచిన తర్వాత కూడా రాతపూర్వక వివరణ ఇవ్వలేదు. దీంతో వ్యక్తిగతంగా కలిసి వివరణ ఇవ్వాలని జేఎండీ ఆదేశించారు. దీంతో వివరణ ఇచ్చి సరిపెట్టారు. పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినా మెమోలతో సరిపెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మెమోకు వివరణ ఇచ్చాం



విజిలెన్స్ తనిఖీల సమయంలో రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం వాస్తవం. తరచూ ఈఈ స్థాయి అధికారి అయిన తాను వెళ్లి రికార్డులు తనిఖీ చేయాలి. పని ఒత్తిడి వల్ల చేయలేకపోయాను. రికార్డుల్లో ఉన్న స్టాక్‌కు, భౌతికంగా ఉన్న స్టాక్‌కు తేడా ఉన్నది వాస్తవమే. డీఈ, ఏఈలతో పాటు నేను కూడా వివరణ ఇచ్చాను.

– ఎ.నాగరాజు, ఇన్‌చార్జి పీడీ, గృహ నిర్మాణ శాఖ

వలస కార్మికుల స్వర్గధామం

ముత్తుకూరు మండలం వలస కార్మికులకు స్వర్గధామంగా నిలుస్తోంది. కృష్ణపట్నం పోర్టు, దానికి అనుబంధంగా ఏర్పాటైన పరిశ్రమల్లో స్థానికులతో పాటు వలస కార్మికులు పెద్దఎత్తున ఉపాధి పొందుతున్నారు. పారిశ్రామిక ప్రగతిలో కీలక పాత్ర పోషించే కార్మికులకు పల్లెలు ఆశ్రయం కల్పిస్తున్నాయి. మరోవైపు వారి కోసం ఏర్పాటైన అద్దెగృహాలు, దుకాణాల ద్వారా వచ్చే ఆదాయంతో గ్రామాలు ప్రగతి సాధిస్తున్నాయి.

ముత్తుకూరు మండలంలోని పది పంచాయతీల్లో నివాసాలు

- కార్మికుల కోసం అద్దె గదుల నిర్మాణం
- పెరుగుతున్న గ్రామాల విస్తీర్ణం
- ఆరు వేల మందికిపైగా స్థానికేతరులు
- పారిశ్రామిక ఉత్పత్తుల్లో కీలకం



దుకాణాల వద్ద వస్తువులు కొనుగోలు చేస్తున్న వలస కార్మికులు

ముత్తుకూరు: జిల్లాలో ఎన్నో ప్రాజెక్టులు, పరిశ్రమలకు కేంద్రంగా ఉన్న ముత్తుకూరు మండలం ఇతర రాష్ట్రాలకు చెందిన వేలాది మంది వలస కార్మికులకు నీడను ఇస్తూ అక్కున చేర్చుకుంటోంది. పారిశ్రామిక ఉత్పత్తుల్లో కీలకపాత్ర పోషిస్తున్న కార్మికులకు పలు పంచాయతీలు అండగా నిలిచాయి. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో ప్రారంభమైన కృష్ణపట్నంపోర్టుతో ప్రైవేట్ రంగంలో ఒక థర్మల్ విద్యుత్ ప్రాజెక్ట్, పబ్లిక్ రంగంలో మరో థర్మల్ విద్యుత్ ప్రాజెక్ట్ ఏర్పాటయ్యాయి. పోర్టు నుంచి జాతీయ రహదారి వరకు సరుకులు రవాణా చేసేందుకు విశాలమైన బైపాస్‌రోడ్డు నిర్మించగా, ఈ రోడ్డు పొడవునా పంటపాళెం పంచాయతీలో పామాయిల్ ఫ్యాక్టరీలు పురుడుపోసుకున్నాయి.

వేలాది మందికి ఉపాధి

జిల్లాకు తలమానికంగా ఉన్న కృష్ణపట్నంపోర్టులో సుమారు 5వేల మందికిపైగా కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో 2వేల మందికిపైగా రాష్ట్రేతరులు ఉండడం విశేషం. వీరంతా ముత్తుకూరు, కృష్ణపట్నం పంచాయతీల్లో అద్దె గదుల్లో నివాసం ఉంటున్నారు. అలాగే నేలటూరులోని సెయిల్ థర్మల్ ప్రాజెక్ట్ ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌ల్లో పనిచేసే ఇతర రాష్ట్రాల కార్మికులు నేలటూరు, పైనాపురం, మునురువారిపాళెం, పిడతాపోలూరు, మామిడిపూడి పంచాయతీల్లో నివాసం ఉంటున్నారు. పోర్టు బైపాస్‌రోడ్డులోని పామాయిల్ ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులు పంటపాళెం, ఈపూరు, దొరువులపాళెం , నారికేళపల్లి పంచాయతీల్లో అద్దె గదుల్లో నివాసం ఉంటున్నారు. ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడి స్థానికులతో మమేకమై జీవనం సాగిస్తున్నారు. ఉత్పత్తులు, నిర్మాణాల్లో కీలక పాత్ర పోషించే కార్మికులు సుమారు 6వేల మందికిపైగా ఉన్నట్లు అంచనా. వీరి కోసం గ్రామాల్లో వందల సంఖ్యలో గదులు నిర్మాణమవడం విశేషం. ఫలితంగా గ్రామాల విస్తీర్ణం పెరిగింది. కార్మికులు చెల్లించే అద్దెలు అనే కుటుంబాలకు ఆసరాగా నిలిచాయి. స్థానిక బ్యాంకుల్లో ఖాతాలు పెరిగాయి. దుకాణాల సంఖ్య పెరిగింది. వ్యాపారాలు అభివృద్ధి చెందాయి. స్థానికుల ఉపాధి మెరుగుపడింది.

వలస కార్మికుల రాష్ట్రాలు		
జార్ఖండ్	ఒడిసా	తెలంగాణ
బిహార్	చత్తీస్‌గఢ్	

ముత్తుకూరు మండలంలోని పరిశ్రమలు
అదానీ కృష్ణపట్నంపోర్టు
ఏపీజెన్‌కో థర్మల్ ప్రాజెక్ట్
సెయిల్ థర్మల్ ప్రాజెక్ట్
జెమినీ ఎడిబుల్ ఫ్యాట్స్
అదానీ విల్‌మార్(1)
అదానీ విల్‌మార్(2)
ట్రిపుల్ ఎఫ్ ఇండస్ట్రీస్
శ్రీకృష్ణ సౌత్‌ఇండియా
సంతోషిమాత ఆయిల్స్
కార్గిల్ ఆయిల్స్
ఇమామి ఆగ్రోటెక్
బొంగె ఆయిల్స్ (నిర్మాణం)
అనా ఆయిల్స్(నిర్మాణం)
గోకుల్ ఆగ్రోటెక్(నిర్మాణం)
కోస్టల్ ఆయిల్స్(నిర్మాణం)



ఈపూరులో వలస కార్మికుల కోసం నిర్మించిన అద్దె గదులు



పంటపాళెంలో వలస కార్మికుల కోసం నిర్మించిన గదులు

స్థానికేతరులతో వ్యాపారాభివృద్ధి



పంటపాళెం పంచాయతీలో నివాసం ఉంటున్న వలస కార్మికులతో ఎటువంటి సమస్యలు లేవు. వారు స్థానికులతో కలిసిపోయి ప్రశాంతంగా జీవనం సాగిస్తున్నారు. వీరి వల్ల వ్యాపారాభివృద్ధి జరుగుతోంది.

–ఆలపాక శ్రీనివాసులు, సర్పంచ్, పంటపాళెం

అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం



థర్మల్ విద్యుత్ ప్రాజెక్టుల్లో పనిచేసే కార్మికులు మామిడిపూడిలో అద్దె గదుల్లో నివాసం ఉంటున్నారు. వీరికి అవసరమైన మౌలిక సదుపాయాలు అందుతున్నాయి. వీరి నివాసాల వల్ల ఇంటి పన్నులు వసూలవుతున్నాయి.

–కాకి మస్తానమ్మ, సర్పంచ్, మామిడిపూడి

స్థలాల అమ్మకం పెరిగింది



స్థానికేతరుల రాకతో ఈపూరులో ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాల విలువ పెరిగింది. అద్దె గదుల నిర్మాణం జరిగింది. గ్రామం విస్తరించింది. పామాయిల్ పరిశ్రమల వల్ల ఉపాధి మెరుగుపడింది.

–అనంతరాజు శశిధర్, సర్పంచ్, ఈపూరు

ఖలీల్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

- జగనన్న మాట కోసమే నరసరావుపేటకు
- నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్



ఖలీల్‌ను పరిచయం చేస్తున్న నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశీర్వాదంతో నెల్లూరు నగర నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న డిప్యూటీ మేయర్ ఖలీల్‌అహ్మద్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని నగర ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని రాజన్న భవనం వద్ద నగర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే అనిల్ మాట్లాడుతూ ఖలీల్‌అహ్మద్ విజయానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేసి భారీ మెజార్టీని జగనన్నకు అందించాలని పిలుపునిచ్చారు. జగనన్న సైనికుడిగా ఆయన ఆదేశించగానే నరసరావుపేటకు వెళ్లేందుకు అంగీకరించానని స్పష్టం చేశారు. సోషల్‌మీడియాలో వస్తున్న వార్తలు వాస్తవం కాదన్నారు. అణగదొక్కాలనుకున్న ప్రతిసారి తాను పైకి లేచానన్నారు. నగర నియోజకవర్గం నుంచి ముస్లిం మైనార్టీలకు సువర్ణ అవకాశం లభించిందన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఖలీల్‌అహ్మద్‌ను అందరి సహాయసహకారాలతో గెలిపించుకుని శాసన సభకు పంపిస్తామన్నారు. నగర నియోజకవర్గం తన సొంతిల్లు..నగర ప్రజలు కుటుంబ సభ్యులని..తాను ఎవరిని వదిలిపోవడం లేదన్నారు. జగనన్న ఆదేశాలతో నరసరావుపేట ఎంపీగా పోటీ చేస్తున్నానన్నారు. తాను ఎక్కడ ఉన్నా 24గంటలు నగర ప్రజల గురించే ఆలోచిస్తానన్నారు. ఇక్కడి ప్రజలే తన దమ్ము, ధైర్యమని, ముఖ్యంగా ముస్లిం సామాజికవర్గం తనకు గుండెకాయతో సమానమన్నారు. సామాన్యుడికి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నమ్మకాన్ని నెల్లూరు ప్రజలు వమ్ముచేయరన్నారు. ఒకప్పుడు సామాన్యుడిగా తాను నగర నియోజకవర్గంలో ఉండేవాడినని, ప్రజల సహాయసహకారాలు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహం తనను రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా చేశాయన్నారు. మహా మహా నాయకులను మట్టుబెట్టేది సామాన్యుడేనని చరిత్ర చెబుతోందన్నారు. ఖలీల్ గురించి చులకనగా మా ట్లాడిన వారందరికి సరైన సమాధానం చెప్పాలన్న కసి తోటి నాయకులు, కార్యకర్తల్లో ఉండాలన్నారు. తనకన్నా నగరంలో శత్రువులు ఉన్నారేమో గానీ, ఖలీల్‌అహ్మద్ అందరివాడని, కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. తానంటే ఇష్టపడని వారు కూడా జగనన్న కోసం ఖలీల్‌అహ్మద్ గెలుపునకు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. తాను ఏ తప్పు చేయలేదని తెలియకుండా తప్పులు ఏమైనా జరిగి ఉంటే నగర ప్రజలు క్షమించాలని అభ్యర్థించా రు. నగరంలో ముస్లిం మైనార్టీలకు వచ్చిన అవకాశాన్ని ఒక చరిత్రాత్మక విజయంగా మార్చా లని భావోద్వేగంగా అందరికీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్, నగర నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకు లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

సంగం: కావలి కాలువ ఆయకట్టు రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకోవాలని కావలి కాలువ డీఈ వెంకటరమణయ్య సూచించారు. స్థానిక జలవనరుల శాఖ అతిథి గృహంలో కావలి కాలువ ఆయకట్టు రైతులతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. సాగునీటి పొదుపుపై అవగాహన కల్పించారు. సోమశిల నుంచి నీటి విడుదల తగ్గుతున్నందున కావలి కాలువ కింద మోటార్ల ద్వారా పండించుకునే ఏడు గ్రామాల రైతులు వారంలో నాలుగు రోజులు మాత్రమే సాగునీటిని వాడుకోవాలని సూచించారు. సాగునీటి విషయంలో ఇరిగేషన్ అధికారులకు రైతులు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయాధికారి శ్రీహరి, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి, ఏఈ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 133
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 236
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 262
లేయర్ చికెన్	: 145

నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.62
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.25

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో రాణించిన నెల్లూరు జట్టు



రన్నర్‌గా నిలిచిన నెల్లూరు జట్టు

కొడవలూరు: అండర్–14 బాలుర రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో నెల్లూరు జిల్లా జట్టు రన్నర్‌గా నిలిచింది. విశాఖపట్నం జిల్లా భీమిలిలో ఈ నెల 2 నుంచి ఆదివారం వరకు జరిగిన ఈ పోటీల్లో ఫైనల్‌లో కర్నూలు విజేతగా నిలవగా, నెల్లూరు జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలకు పోలీస్ అసిస్టెంట్ కమిషనర్ జాన్ మనోహర్ చేతుల మీదుగా షీల్డులు ప్రదానం చేశారు. అండర్–14 బాలుర జిల్లా రగ్బీ జట్టును ఈ నెల 1న మండలంలోని గండవరం హైస్కూల్‌లో ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో రన్నర్‌గా నిలిచిన జిల్లా జట్టును జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ శ్రావణ్‌కుమార్, పోతురాజు రమేష్, కోచ్ దాసరి వంశీ ప్రత్యేకంగా అభినందించారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణుల సంబరాలు

జిల్లా కోర్టులో ఫైళ్ల చోరీ కేసులో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాత్ర ఏమీ లేదని సీబీఐ క్లీన్‌చిట్ ఇవ్వడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం సంబరాలు జరుపుకొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకుని హర్షం వ్యక్తం చేశారు. –సాక్షి నెట్‌వర్క్



మనుబోలులో బాణసంచా కాల్చుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు